بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِیْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 02.01.2015 (Telugu)

**పురుషులు ఐదు పూటల నమాజ్ నిబంధనలతో నలువుటనగా సామూహికముగా మస్జిదునకు వెళ్లి నలుపవలెను. దీనిని ఆచరించడం మొదలైనచో మన మస్జిదులు ఆరాధకులతో నిండిపోవును. కేవలము పదవీదారులు దీనిని ఆచరించినను చాలా మార్పు ఏర్పడును. నమాజ్‌ను వదలదలచిన వ్యక్తి పశువుల కంటే ఎక్కువ ఏమి చేసినాడు. ఇతనిలో, పశువులలో ఎలాంటి తేడా లేదు.**

*హజ్రత్ అమీరుల్ మూమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 02.01.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

నేటి జుమా ఈ నూతన సంవత్సరం 2015 మొదటి జుమా. నూతన సంవత్సరం శుభాకాంక్షల సందేశములు నాకు వివిధ వ్యక్తుల నుండి అందుచున్నవి. మీరందరికి నూతన సంవత్సరం అన్ని విధాలా శుభప్రదమగుగాక! గత సంవత్సరం అహ్మదీ అయిన హక్కులు ఎంత వరకు చెల్లించినామో పరిశీలించినప్పుడు ఈ శుభాకాంక్షలు తెలుపుట ప్రయోజనము కలిగించును. భవిష్యత్తులో ఈ హక్కులు చెల్లించుటకు ఎంత వరకు ప్రయత్నింతుము ఆలోచించవలెను. నూతన సంవత్సరంలో ఈ హక్కును చెల్లించుటకు కష్టము, ప్రయత్నము చేయుటకు మనము ఈ జుమా నుండి సంకల్పించవలెను. సత్కార్యములు చేయడంతోనే అహ్మదీ అయిన మన హక్కు చెల్లించబడునను విషయము విధితమే. కాని అ సత్కార్యముల ప్రమాణము ఎంత వరకుండవలెను. ఈ ప్రమాణమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం స్వయాన తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఉపదేశించిన ప్రమాణములను పొందుటకు పూర్తిగా ప్రయత్నించునని ఇప్పుడు అధునాతన వసతులు, టెక్నాలజీ వలన సంవత్సరంలో కనీసం ఒక్క సారి వర్తమానా ఖలీఫా హస్తమున ప్రతి అహ్మదీ బైఅత్ ప్రతిజ్ఞ చేయును. చెప్పుకొనుటకు ఇవి పది నిబంధనలు మాత్రమే. కాని ఒక అహ్మదీగా మోపబడిన బాధ్యతల సంఖ్య 30 వరకు చేరును.

మనము మన సంవత్సరములను ఆనందముతో గడుపుటకు ఈ విషయములను మన దృష్టిలో వుంచుకోవలసిన అవసరముంది. నేను ఈసా మరణ సమస్య, రాబోవు మసీహ్ భవిష్యవాణిని విశ్వసించినాని అనందపడుట ఒక అహ్మదీయునికి తగదు. నిస్సందేహముగా ఇది మొదటి అడుగు. సత్కార్యములను లోతుగా అర్థము చేసుకొని వాటిని ఆచరించుటను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం

మనతో ఆశించిరి. ఒక మృగ జంతువు నుండి మనిషి తనను తాను రక్షించుకొనునట్లే దుష్కార్యముల నుండి తనను తాను రక్షించుకోవలెను. ఇది జరిగినప్పుడు మనము మన స్థితులలో విప్లవము సృష్టించుకొనువారమే కాక ప్రపంచమును మార్చి అల్లాహ్ సమీపమున చేర్చుటకు కారణమగుదుము. ఏది ఏమైనప్పటికి వీటి కొంత వివరణ నేను నేడు ప్రస్తావింతును. మన బైఅత్ ఉద్దేశము సదా మన ముందుండవలెను.

అన్యారాధన నుండి దూరముండవలెనను ప్రతిజ్ఞ వారు మనతో తీసుకొనుట మొదటి విషయము. ఏ సూక్ష్మమైన విషయము వైపు మన దృషి కలిగించుచున్నారో అది బాహ్య అన్యారాధన కాదు, ఒక విశ్వాసుని విశ్వాసమును బలహీనపరచు గుప్త అన్యారాధన. దీనిని వివరించుచు ఒక చోట హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

“హృదయములో వేలాది విగ్రహములు వుంచుకొని నోటితో లాఇలాహ ఇల్లల్లాహ్ అనుట మాత్రమే దైవ ఏకత్వము కాదు. ఒక వ్యక్తి తన కార్యము, ప్రణాళిక, కుట్రకు దేవుని వలె గొప్పతనము ఇచ్చినచో లేదా దేవుని వలె మానవునిని నమ్మినచో, దేవునికి ఇవ్వవలసిన గొప్పతనము తన మనసుకు ఇచ్చినచో ఈ పరిస్థితులన్నిటిలో అతడు విగ్రహారాధకుడగును. బంగారము, వెండి, రాగి, రాయిపై చిత్రించబడి, వాటిని నమ్మినవి మాత్రమే విగ్రహము కాదు. అల్లాహ్‌కు ఇవ్వవలసిన గొప్ప తనము ఇవ్వబడిన ప్రతి ఒక్క విషయము, కార్యము అల్లాహ్ దృష్టిలో విగ్రహమగును”.

గత సంవత్సరము మనము ఈ ప్రణాళికలను, సాకులను ఎంత వరకు విశ్వసించినామో పరిశీలన చేసుకోవలెను. వాటినే సర్వమని మనము నమ్మినామా లేదా ప్రణాళిక కొరకే ఉపయోగించినామా. అల్లాహ్ ఆస్థానములో సాష్టాంగము చేసి అల్లాహ్ అనుగ్రహము, శుభము కోరినామా. న్యాయముగా తమ పరిశీలన మనకు మన ప్రతిజ్ఞ వాస్తవము తెలియును.

మరల అసత్యమాడకూడదని వారు మనతో ప్రతిజ్ఞ చేయించిరి. ప్రాణము, ధనము, గౌరవము ప్రమాదములోనున్నను అసత్యమాడక పోవుట గొప్ప ప్రవర్తనలు. తమ స్వప్రయోజనాలను సత్యము కొరకు త్యాగము చేయవలెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అసత్యము కూడ ఒక విగ్రహము. దానిని నమ్మువ్యక్తి అల్లాహ్‌ను వీడును. కనుక ఇంత క్షుణ్ణంగా తమ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది.

వ్యభిచారము నుండి దూరముందునని ప్రతిజ్ఞ తీసుకొనెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. వ్యభిచారము దరి చేరకుము. ఇటువంటి ఆలోచన కలిగే సందర్భముల నుండి కూడ దూరముండుము. ఈ పాపములు సంభవించే అవకాశమున్న మార్గముల నుండి దూరముండుము. ఈ రోజులలో టి.వి., ఇంటర్నెట్ యున్నవి. వీటిని తెరిచినచో అసభ్యకర చిత్రములు ప్రత్యక్షమగును. వీటితో దర్శన వ్యభిచారమగును, ఆలోచనల వ్యభిచారమగును. ఇవి పాపములలో నిమగ్నమగుటకు కారణమగును. సంసారములు విడిపోవును. ఈ సమాజములో నివసించుచు తమను తాము రక్షించుకొనుటకు ప్రయత్నించనిచో ఎటువంటి పవిత్రతకు నమ్మకముండదు. ఈ కోణంలో కూడ చాలా ఆలోచించవలసిన అవసరమున్నది. దుష్టచూపు నుండి దూరముందునని మనతో ప్రతిజ్ఞ తీసుకొనిరి. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ దుష్ట చూపుకు అవకాశము లభించకూడదని చూపును క్రింద వుంచవలెనని ఆజ్ఞాపించెను. అల్లాహ్ నిషేధించిన వాటిని చూడకుండా

నేలకు వంగిన కనులపై అగ్ని నిషేధించబడెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పర స్త్రీలను, వారి శృంగార ప్రదేశములను అస్సలు చూడకూడదని మనకు ఆదేశము గలదు. స్వతంత్ర చూపుల వలన ఏదో ఒక సందర్భమున సన్మార్గము కోల్పోయే అవకాశమున్నది. మన కనులు, హృదయములన్నిటిని ప్రమాదముల నుండి దూరముంచదలచెను. అందుకే అతడీ ఉన్నత స్థాయి బోధన అందించెను. నిబంధనలను పాటించుట పరుషులు, స్త్రీలు తప్పనిసరి అని వారు ఉపదేశించిరి. ముసుగు ధరించవలసిన ఆజ్ఞ స్త్రీలకు వున్నట్లే క్రింద చూపు వుంచవలెనను ఆజ్ఞ పురుషులకు కూడ గలదు. దీనిని మనమెంత వరకు పాటించుచున్నామో గ్రహించవలెను. ప్రతి దుష్కార్యము నుండి దూరముందునని ప్రతిజ్ఞ తీసుకొనెను. అల్లాహ్ ఆజ్ఞలను దాటుట పాపము. దూషించుట పాపమని ఒక సందర్భమున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భమున ఇట్లనిరి. అవిశ్వాసుని కంటే ముందు పాపిష్టుడిని శిక్షించవలెనని పవిత్ర ఖుర్ఆన్ ద్వారా రుజువగును. ముస్లిములు పాపములలో హద్దులు దాటినప్పుడు అల్లాహ్ ఆజ్ఞలను కించపరచుట, పుణ్యక్షేత్రాలను ద్వేషించసాగిరి. ప్రపంచము, దాని తళుకు బెళుకులో నిమగ్నమైరి. అల్లాహ్ కూడ అటులనే హలాకు ఖాన్, చంగేజ్ ఖాన్ ద్వారా వారిని నాశనమొనర్చెను. ప్రపంచ ముస్లిముల పరిస్థితి నేడు కూడ అలాగే యున్నది.

హింసకు దిగనని మరో ప్రతిజ్ఞ తీసుకొనెను. హింస ఒక ఘోరమైన పాపము. ఏ హింస పెద్దదని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రశ్నించనైనది. వారు ఇట్లనిరి. ఒక వ్యక్తి తన సోదరుని ఒక గజం భూమిని వశపరచుకొనునట హింస అనబడును. అతడు వశపరచుకొనిన ఈ భూమిలోని ఒక్క కంకర కూడ ఎంత క్రింది వరకున్నదో అల్లాహ్‌యే ఎరుగును. అంత వరకు గొసులుగా సిద్ధము చేసి అతని మెడలో వేయబడును. కావున ఇది చాలా భయపడవలసిన సందర్భము. వాజ్యములలో తమ గర్వముతో స్వార్థ ప్రయోజనాలను పొందుటకు ప్రజల హక్కులు హరించేవారు గమనించవలెను.

అవినీతికి పాల్పడమని మరో వాగ్దానము మనతో తీసుకోబడెను. అవినీతికి పాల్పడని ప్రమాణము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపిరి. మీతో అవినీతిగా వ్యవహరించిన వ్యక్తితో కూడ అవినీతిగా వ్యవహరించకూడదు. ఈ ప్రమాణములను మనము పొందవలెను. అవినీతి ఆలోచనతోనే విశ్వాసునిపై పిడుగు పడును.

ప్రతి పీడనము నుండి దూరముండునను మరో ప్రతిజ్ఞ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ స్థాపించిన సంస్థలో మీరు చేరినందుకు మాత్రమే మిమ్ములను వీడు వారితో ఘర్షణకు దిగకుము. పరోక్షముగా వారి కొరకు దుఆ చేయుము. మీకు పదే పదే మార్గదర్శనము చేయుటకు నేను పంపబడితిని. దుష్టత్వమునకు సత్కార్యముతో సమాధానమివ్వుము. ఎవరైనా అశాంతి కలిగించుటకు ప్రయత్నించినచో అక్కడి నుండి వెళ్లిపొమ్ము. నిదానముగా సమాధానమివ్వుము. ఈ సంస్థకు చెందిన వ్యక్తి అయి ఒకరితో జగడమాడినట్లు నేను విన్నప్పుడు నాకు విచారము కలుగును. ఈ పద్ధతిని నేను ఇష్టపడను. ప్రపంచములో ఆదర్శముగా నిలువవలసిన సంస్థ ధర్మబద్ధమైన మార్గమును అవలంభించక పోవుటను అల్లాహ్ ఇష్టపడడు.

తిరుగుబాటు పద్ధతి నుండి దూరముందునను మరో వాగ్దానము మనతో తీసుకోబడెను. తిరుగుబాటును సూచించే పద్ధతుల నుండి కూడ దూరముండవలెనని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశించిరి. మానసిక కోరికలకు లొంగనని కూడ ప్రతిజ్ఞ చేయుమని వారనిరి. మానసిక కోరికలకు లొంగిపోయే అనేక సందర్భములు టి.వి., ఇంటర్నెట్ ద్వారా ఎదురయ్యే అవకాశముంది. మానసిక కోరికలను ఉత్తేజపరచే లేదా లొంగిపోయే అవకాశమున్న చిన్న చిన్న విషయముల నుండి దూరముండుటకు కృషి చేయవలెను.

అహ్మదియ్యత్‌లో చేరి ఐదు పూటల నమాజులను నిబంధనలతో పాటించు ప్రతిజ్ఞనను కూడ పూర్తి చేయవలెను. ఇందుకు ప్రతిజ్ఞ చేయుము. పది సంవత్సరముల వయసు గల బాలునిపై కూడ నమాజ్ విధించబడినది. తల్లిదండ్రులు దీనిని పర్యవేక్షించవలెను. తల్లిదండ్రులు నమాజులలో ఆదర్శముగా వున్నప్పుడే పర్యవేక్షణ పూర్తి అగును. అనారోగ్యము లేదా ఏదేని ప్రత్యేక కారణము లేనిచో పురుషులు ఐదు పూటల నమాజును నిబంధనలతో సలుపుటనగా మస్జిదులకు వెళ్లి సలుపుట అని అర్థము. దీనిని ఆచరించినచో మన మస్జిదులు ఆరాధకులతో నిండిపోవును. పదవీదారులు దీనిని ఆచరించినా ఎంతో తేడా కనిపించును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నమాజు నుండి విశ్రాంతి పొందగోరిన వాడు పశువుల కంటే ఎక్కువ ఏమి చేసినట్లు. అతనిలో పశువులలో ఎలాంటి భేదము లేదు. ఒక అహ్మదీ ఇటువైపు అధిక శ్రద్ధ వహించవలసిన అవసరముంది. నమాజె తహజ్జుద్ ఏర్పాటు చేయుదుమని ప్రతిజ్ఞ తీసుకొనెను. గత సత్కార్యుల పద్ధతి ఇది. అల్లాహ్ సామీప్యము పొందుటకు ఇదొక కారణము. ఈ అలవాటు పాపముల నుండి రక్షించును, పాపములను అంతము చేయును, శారీరక వ్యాధుల నుండి నిరోధించును. ఆధ్యాత్మిక చికిత్సయే కాదు శారీరక చికిత్స కూడ. మా జమాఅత్ తహజ్జుద్‌ను తప్పక పాటించవలెను. ఎక్కువ కానిచో రెండు రకాతులైనా చదువవలెను. దుఆలకు అవకాశము లభించును. అప్పటి దుఆలలో ఒక ప్రత్యేక ప్రభావముండును.

ఆ తర్వాత అంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపే ప్రతిజ్ఞ మనతో తీసుకొనిరి. నాపై దురూద్ చదివినవానిపై అల్లాహ్ పది రెట్లు కరుణించును. దురూద్‌కు చాలా ప్రధాన్యత గలదు, దుఆల ఆమోదమునకు కూడ దురూద్ ఎంతో అవసరము. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. మన ప్రవక్తపై దురూద్ పంపనంత వరకు దుఆ ఆకాశము, భూమి మధ్య నిలిచిపోవును. ఏ భాగము కూడ పైకి పోదు.

క్రమం తప్పకుండా క్షమాపణ యాచింతుమని బైఅత్‌లో మనము ప్రతిజ్ఞ చేయుదుము. వరుసగా క్షమాపణ యాచించు వానికి అల్లాహ్ ప్రతి కష్టము నుండి విముక్తి మార్గము చూపును. అతని ప్రతి కష్టము అతనికి విశాలత మార్గమును తెరుచును. అతను ఊహించని మార్గముల నుండి ఆహారము నొసంగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ సదా క్షమాపణ ఏర్పాటు చేసెను. రహస్య. బాహ్య, తెలిసి, తెలియని పాపము కొరకు మానవుడు క్షమాపణ యాచించవచ్చును. అల్లాహ్ ఉపకారములను గుర్తుంచు కొందుమని మనతో ప్రతిజ్ఞ తీసుకొనెను. అల్లాహ్ ఉపకారములలో అన్నిటి కంటే పెద్ద ఉపకారము మనము వర్తమాన ఇమామ్‌ను స్వీకరించే అనుగ్రహమిచ్చుట. అల్లాహ్ ఈ ఉపకారము మనకు

అనుక్షణం గుర్తుంచుకున్నచో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో స్వచ్ఛమైన సంబంధము నెరుపుటకు ఎల్లప్పుడు కృషి చేయుదుము. వారి మాటలను ఆచరించే శ్రద్ధ వుండును.

నేను అల్లాహ్‌ను కీర్తించుదునను ప్రతిజ్ఞ గలదు. అల్లాహ్‌ను కీర్తించనిదే మొదలు పెట్టిన ప్రతి ముఖ్య కార్యము అశుభమగును. చిన్న దానికి కృతజ్ఞతలు తెలుపని వ్యక్తి పెద్ద దానికి కూడ కృతజ్ఞతలు తెలుపలేడు. ప్రజలకు కృతజ్ఞతలు తెలుపని వ్యక్తి దేవునికి కూడ కృతజ్ఞతలు తెలుపలేడు. అల్లాహ్ ప్రాణుల పట్ల కృతజ్ఞతా భావంతో వుండు విధముగా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపవలెను.

అల్లాహ్ సాధారణ ప్రాణులకు మనము హాని కలిగించమని మరో ప్రతిజ్ఞ చేసినాము. ప్రత్యేకముగా ముస్లిములకు మానసిక కోరికల వలన ఎలాంటి హాని కలిగించమని మరో ప్రతిజ్ఞ చేసినాము. సాధ్యమైనంత వరకు క్షమింతుము. సంస్కరణ కొరకు శిక్షించవలసిన అవసరమున్నచో చట్టమును తమ చేతిలో తీసుకోక అధికారులకు తెలుపుదుము. స్వయముగా ప్రతీకారము తీసుకోకూడదు, నిరాడంబరత పద్ధతిని అవలంభించుము.

ప్రతి స్థితిలో అల్లాహ్‌కు విశ్వసనీయునిగా వుందుమను మరో ప్రతిజ్ఞ గలదు. సంతోషము, కష్టము ఏ స్థితి అయినను అల్లాహ్‌తో సంబంధము కొనసాగింతుము. ప్రతి స్థితిలో అల్లాహ్ వైపు పరుగెత్తుట విశ్వాసుని కర్తవ్యము. అప్పుడే అల్లాహ్ మార్గములో ప్రతి అవమానము, బాధను భరించు ప్రతిజ్ఞనను పూర్తి చేయువారమగుదుము. ఎప్పుడైనా ఎటువంటి ఆపద ఎదరైనప్పుడు వీపు చూపము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. కష్టము, ప్రజల ఆరోపణ, ఆకాశ ఆపదల వలన నా వారు నా నుండి విడిపోలేరు. మనము అల్లాహ్ కొరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారిగా నుండవలెను. ఇందుకు ప్రయత్నించవలెను. ఇన్షాఅల్లాహ్. బాధ, అవమానమునకు గురి చేయబడినా మనము లెక్క చేయకూడదనుని మన ప్రతిజ్ఞ. దురాచారాలను ఆచరించనని మరో ప్రతిజ్ఞ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. తన పోషకుని ముందు నిలుచుటకు భయపడుచు తన మానసిక కోరికల నుండి దూరముండు వ్యక్తికి స్వర్గములో స్థానము లభించును. పవిత్ర ఖుర్ఆన్ ప్రభుత్వమును పూర్తిగా తనపై విధించుకొనునను మరో ప్రతిజ్ఞ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మీరు జాగ్రత్తగా వుండుము. అల్లాహ్ బోధన, ఖుర్ఆన్ మార్గదర్శనమునకు విరుద్ధముగా ఒక్క అడుగు కూడ వేయకుము. పవిత్ర ఖుర్ఆన్ ఎడు వందల ఆజ్ఞలలోని ఒక్క ఆజ్ఞను వీడు వ్యక్తి తనపై స్వర్గ ద్వారమును మూసుకొనునని నేను నిజముగా చెప్పుచున్నాను.

అల్లాహ్, అతని ప్రవక్త ప్రతి ఆజ్ఞను తమ కొరకు స్ఫూర్తిగా చేసుకొందుమను మరో ప్రతిజ్ఞ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మన ప్రవక్త ఒక్కడే. పవిత్ర ఖుర్ఆన్ మాత్రమే అతనిపై అవతరించినది. దీనిని ఆచరించి మనము అల్లాహ్‌ను పొందవచ్చును. ఇందుకు మనము ప్రయత్నము చేయవలెను.

గర్వము, అహంకారమును పూర్తిగా వీడుదుమను మరో ప్రతిజ్ఞ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ప్రళయ దినమున అన్యారాధన తర్వాత గర్వము వంటి ఏ ఆపద లేదు. ఈ ఆపద

మానవున్ని ఇహ, పరలోకములో అవమానమునకు గురి చేయును. కనుక చాలా భయపడవలసిన సందర్భము. నేను నా జమాఅత్‌నకు ఇట్లు ఉపదేశించుచున్నాను. గర్వము నుండి దూరముండుము. ఎందుకనగా గర్వము మన దేవుని దృష్టిలో చాలా హీనమైనది. నిరాడంబరత, సాధారణ జీవితమును ఆచరింతునని మరో ప్రతిజ్ఞ తీసుకోబడెను. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ కొరకు నిరాడంబరతను పాటించినవానికి అల్లాహ్ స్వర్గములో ఒక స్థాయిని పెంచును. తుదకు అతనికి ఉన్నతులలో స్థానము కల్పించును. సదా మంచి ప్రవర్తనలను మా అలవాటుగా చేసుకొందుమనునది మరో ప్రతిజ్ఞ గలదు. దీనిని కూడ ప్రతి ఒక్కరు సదా దృష్టియందుంచుకోవలెను. అతి వినయముతో జీవితమును గడుపుదునను మరో ప్రతిజ్ఞ గలదు. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్‌ను అన్వేషించవలసినచో నిరుపేదలలో అన్వేషించుము.

ధర్మము, ధర్మ గౌరవము, ఇస్లాంతో సానుభూతిని తన ప్రాణము, ధనము, గౌరవము, సంతానము కంటే గొప్పగా చూసుకొందునను మరో ప్రతిజ్ఞ గలదు. అల్లాహ్ కొరకు అల్లాహ్ ప్రాణులతో సదా సానుభూతిగా వ్యవహరింతునను మరో ప్రతిజ్ఞ తీసుకొనెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ సత్కార్యమును చాలా ఇష్టపడును. అతని ప్రాణులతో సానుభూతిగా వ్యవహరించవలెనని అతను కోరును. నాతో సంబంధమున్న మీరందరు కుల మతాల కతీతంగా అందరితో సానుభూతిగా వ్యవహరించుము. ఎందుకనగా ఇదే పవిత్ర ఖుర్‌ఆన్ బోధన.

అల్లాహ్ ప్రసాదించిన శక్తులతో మానవులకు ప్రయోజనము కలిగించుమను మరో ప్రతిజ్ఞ గలదు. ప్రపంచ ఆధ్యాత్మిక ప్రగతి కొరకు ప్రయత్నించుట కూడ మానవులకు ప్రయోజనము కలిగించు పరిధిలోకి వచ్చును. ఇహ,పరలోక పరమైన లాభములు కలిగించుట కూడ మన బాధ్యత. బాహ్య రూపములో ప్రయోజనము కలిగించుట, ప్రజా సేవతో పాటు మానవ జాతి కొరకు ప్రచారము చేయుట కూడ ఒక అహ్మదీయుని కర్తవ్యము. ఈ సం॥ మనము హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆశల మేరకు అగుదుము గాక!

7 డిశంబర్ తేదీన అమరులైన గౌ॥ లుఖ్మాన్ షహ్‌జాద్ తండ్రి గౌ॥ అల్లాహ్ దత్తా, 19 నవంబర్ తేదీన మృతి చెందిన గౌ॥ షహ్‌జాద సత్వాన్స్ ఆఫ్ మఖ్దూనియా గార్ల పరోక్ష అంత్యక్రియ ప్రార్థనలు కూడ నమాజ్ తర్వాత హుజూర్ చదివించిరి. ✡ ✡ ✡ ✡

*Summary: Nashr-o-Isha'at, Translation:Hafiz Syed Rasool Niyaz, (Telugu Desk)*

Published by: Nazarath Nashr-O-Isha'ath, e-mail:telugudesk@yahoo.in
P.O.:Qadian, Dist:Gurdaspur, Pin:143516, Punjab, Mob 84376 99866

BOOK POST (PRINTED MATTER)

*To,*

.......................................................................................

.......................................................................................